తాగునీటిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్

తాగునీటి సమస్యలను అధిగమించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, మార్చి 30 : వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ కేంద్రాల్లో స్వచ్ఛంద సేవా సంస్థలతో చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలన్నారు. పంచాయతీల్లో కార్యదర్శులు ఏఎన్ఎంలను సమన్వయం చేసుకొని వడగాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమాదేవి, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, సీపీడీ సుబ్బారావు, డీహెచ్‌హెస్ మరియన్న, డీపీవో హరిప్రసాద్, అడిషనల్ డీఆర్డీవో శాంతకుమారి, డీపీవో అభిమన్యుడు, విద్యుత్ అధికారి నరేశ్, ఆర్‌అండ్‌బీఈఈ తానేశ్వర్, మహబూబాబాద్, గూడూరు అటవీశాఖ డివిజనల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైల్వే అలైన్‌మెంట్ మార్చాలని వినతి

రవిచంద్రతో మాట్లాడుతున్న రైతులు

డోర్నకల్, మార్చి 30 : పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతుల వ్యవసాయ భూములకు నష్టం కలిగించే డోర్నకల్- గద్వాల్ రైల్వే అలైన్‌మెంట్‌ను మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధిత రైతులు శనివారం రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు విజ్ఞప్తి చేశారు. ఖమ్మంలోని ఆయన నివాసంలో కలుసుకొని సమస్యను వివరించారు. పాపటపల్లి నుంచి జాన్‌పాడు వరకు నిర్మించనున్న అలైన్‌మెంట్ రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా మోతే మీదుగా జాన్‌పాడుకు మార్చాలని కోరారు. ఇప్పటికే మోటమర్రి-జాన్‌పాడు డబ్లింగ్ లైన్ మంజూరైనందున, దానిని ఉపయోగించుకొని ప్రతిపాదిత జాన్‌పాడు, పాపటపల్లి లైన్ ప్రతిపాదన రద్దు చేసేలా సహకరించాలని కోరారు. ఎవరికీ నష్టం కలుగకుండా ప్రత్యామ్నాయ మార్గాల సమగ్ర నివేదికతో వస్తే కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో బాధిత రైతులు వల్లూరి పట్టాబిరెడ్డి, సయ్యద్ సాదిక్ అలీ, తోట రామారావు, ఉప్పలరావు, రాము, పండరి రాజు, నల్ల పునేని రమణయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనకు తరలిరావాలి..

తొర్రూరు, మార్చి 30 : వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తూ పంటలకు సాగునీరు ఇవ్వకుండా అన్నదాతలను అతలాకుతలం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని, ఎండిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు దేవరుప్పుల మండలం ధరావత్ తండాకు మాజీ సీఎం కేసీఆర్ వస్తున్నందున, మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలిరావాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాములు కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు.. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరావత్‌తండాకు ఉదయం 9.30కు కేసీఆర్ వస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ రైతు బంధు అధ్యక్షులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, నాయకులు తరలివచ్చి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

బయ్యారం సొసైటీలో రగడ

- మహాజనసభలో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం
- చైర్మన్ మధుకర్‌రెడ్డి రూ.54 లక్షల దుర్వినియోగం చేశాడంటూ వైస్ చైర్మన్ వర్గం డైరెక్టర్ల ఆరోపణ
- ఆతడిటర్ల స్పష్టతతో సద్దుమణిగిన వివాదం
- సొసైటీ సభ్యుల్లో గందరగోళం

చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మర్ సత్యనారాయణ వర్గాల మధ్య వాగ్వాదం

బయ్యారం, మార్చి 30 : బయ్యారం సహకార పరపతి సంఘం కార్యాలయంలో శనివారం రగడ జరిగింది. సంఘం సభ్యులతో ప్రతి ఆరు నెలలకోసారి సమావేశం నిర్వహించి, లావాదేవీలు, రైతులకు అందించిన రుణాలు, సేవల వివరాలను సభ్యులకు తెలియజేయడంతోపాటు వారి సలహాలు, సూచనలు స్వీకరించాలి. ఈ క్రమంలో శనివారం సంఘం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో చైర్మన్, వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ వర్గాలకు చెందిన పలువురు డైరెక్టర్ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సొసైటీ లావాదేవిల్లో రూ.54,37,327 దుర్వినియోగం చేయడంతో మూడు నెలల క్రితం డీసీవో కార్యాలయం నుంచి నోటీసులు అందాయని, దీనిపై చైర్మన్ సమాధానం చెప్పాలని వైస్ చైర్మన్ వర్గానికి చెందిన డైరెక్టర్లు పట్టుపట్టారు. చైర్మన్ మధుకర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రొటోకాల్ పాటించకుండా డైరెక్టర్లను అవమానిస్తున్నాడని, పెట్రోల్ బంకు మంజూరు పేరుతో సొసైటీకి చెందిన డబ్బులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి పాల్పడిన చైర్మన్‌ను వెంటనే తొలగించాలని వైస్ ఎంపీపీ గణేశ్ డిమాండ్ చేశారు. దీంతో కలుగజేసుకున్న చైర్మన్ మధుకర్‌రెడ్డి సొసైటీలోని లావాదేవీల్లో ఎలాంటి తేడా లేదని, ప్రతి ఆరోపణకు సమాధానం చెప్పడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కావాలని కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ సొసైటీ ప్రతిష్ఠను దిగజార్చాలని చూస్తున్నారని అన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గంటకు పైగా వాగ్వాదం జరిగింది. అనంతరం సొసైటీ ఆడిటర్లు రాజశేఖరెడ్డి, పత్యనాయక్ కలుగజేసుకొని పాలకవర్గం సభ్యులను సముదాయించడంతో మళ్లీ సభ ప్రారంభమైంది. రూ.54లక్షల సొసైటీ లావాదేవిల తేడాకు సంబంధించి రికవరీ అయ్యాయని అడిటర్లు స్పష్టతనివ్వడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం రైతులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సొసైటీలో ఎకరాకు కేవలం రూ.5వేల నుంచి రూ.10 వేలు మాత్రమే లోన్ ఇస్తున్నారని, అవి ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. పోడు పట్టాలు ఉన్న రైతులకు కూడా క్రాప్ లోన్లు ఇవ్వాలని, కొత్త సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. రైతులకు హెల్త్ కార్డులు అందించాలని, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని పలువురు రైతులు సభ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీఈవో అనూష, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య, శ్రీను, యశోద, కలింగారెడ్డి, నాగమణి, కేతమళ్లు, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.కాగా, బయ్యారం సొసైటీలో జరిగిన ఘటన మండలంలో చర్చనీయంగా మారింది. పాలకవర్గం సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్ వర్గాలుగా విడిపోవడంతో ఏడాది కాలంగా వివాదాలు జరుగుతన్నాయి. చైర్మన్ అవినీతికి పాల్పడుతున్నడని ఆరోపిస్తూ కలెక్టర్‌తోపాటు డీసీవోకు సైతం కొందరు డైరెక్టర్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మరోమారు మహాజన సభలో వాగ్వాదం జరగడం చర్చనీయంగా మారగా, సంఘం సభ్యుల్లో మాత్రం గందరగోళం నెలకొన్నది.

పట్టుదలతో పనిచేస్తే విజయం మనదే..

మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్, మార్చి 30 : పట్టుదలతో పని చేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం మనదేనని మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం డోర్నకల్ పట్టణంలో జైన్ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామన్నారు. డోర్నకల్ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేసినట్లు వివరించారు. దేశంలో బంజారా జాతి ప్రజలు పదికోట్ల మంది ఉన్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి మాయ మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు, రుణమాఫీ వంటి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాక ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. భూ గర్భ జలాలు అడుగంటి సాగునీరు అందకవరి పంటలు ఎండిపోతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధరంసోత్ బాలూనాయక్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెర శాల విద్యాసాగర్, కౌన్సిలర్లు పోటు జనార్దన్, బోరగళ్ల శరత్‌బాబు, ఎంపీటీసీలు నున్న మల్లికార్జున్, బానోత్ శంకర్‌కోటి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కళ్లెపు సతీశ్ కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గుగులోత్ శ్రీనివాస్, బానోత్ పాండూనాయక్, బాలాజీ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు షేక్ అజిత్‌మియా, మారబోయిన రాంభద్రం, నాయకులు మాన్యు పాట్ని, తేజావత్ రమేశ్, కొత్త వీరన్న, కాలా యశోధర్ జైన్, గౌస్ పాషా, రాము, చంటి, పాల్గొన్నారు. అనంతరం ఆయన డోర్నకల్ పట్టణంలో అవుదూర్తి లక్ష్మీనారాయణ (80) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హుస్సేన్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి సన్మానం

గూడూరు, మార్చి 30 : జాతీయ ఎస్టీ సెల్ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం మచ్చర్ల గ్రామంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గ్రామం నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఎస్టీ సెల్ జాతీయ కమిషన్ సభ్యుడిగా ఎన్నికైన హుస్సేన్‌నాయక్ యువతకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాయితోజ్ దేవేంద్రచారి, రహీం, కఠార్‌సింగ్, భూక్యా సురేశ్, బోడ ఎల్లయ్య, ఎండీ అహ్మద్, మాజీ ఎంపీపీ, జిల్లా నాయకుడు చెల్పూరి వెంకన్న, చీకటి కిరణ్, బోడ వెంకన్న పాల్గొన్నారు.

నర్సింహులపేట: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

దంతాలపల్లి: పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

చిన్నగూడూరు: పరీక్ష కేంద్రం నుంచి ఉత్సాహంగా బయటికి వస్తున్న విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

పెద్దవంగర: పరీక్ష కేంద్రంలో విజయసంకేతంతో చూపుతున్న విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం జిల్లావ్యాప్తంగా 49 సెంటర్లలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అన్ని సెంటర్లలో పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు డీఈవో రామారావు తెలిపారు. మొత్తం 8,194 మంది విద్యార్థులకు గాను 8,178 మంది పరీక్ష రాయగా, 16 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. జిల్లా అబ్జర్వర్, జాయింట్ డైరెక్టర్ శ్రీ రాజీవ్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు.

మహబూబాబాద్: పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

బాధిత కుటుంబానికి పరామర్శ

కురవి, మార్చి 30 : మండలంలోని సూదనపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ నాగనబోయిన మహేందర్ తండ్రి నాగనబోయిన ఉప్పలయ్య(70) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఉప్పలయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు మల్సూర్, గాండ్ల లింగయ్య, కన్నెగంటి వెంకటరమణ, సంద వెంకన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్‌ప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి తక్షణమే పరిష్కరించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి సురేశ్, జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి చంద్రశేఖర్ ప్రసాద్

ఇటుక బట్టీలు మూసి వేయాలని నోటీసులు

బయ్యారం, మార్చి 30: మండలంలోని గంధంపల్లి, కొత్తపేట, నామాలపాడు, రాయికుంట, ధర్మపురం గ్రామాల పరిధిలో అనుమతి లేని ఇటుక బట్టీలను మూసివేయాలని 34మంది యజమానులకు మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు నోటీసులు జారీ చేయగా, రెవెన్యూ సిబ్బంది శనివారం వారికి అందజేశారు. 1/70 యాక్ట్ చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు బట్టీలు నిర్వహిస్తున్నారని, జీవో నంబర్ 80 ప్రకారం అడవులకు 200 మీటర్ల దూరం, గ్రామానికి కిలో మీటరు దూరం, జాతీయ రహదారికి 200 మీటర్లు దూరం ఉండాలని బట్టీలు ఉండాలన్నారు. కానీ, నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తున్నందన వాటిని మూసివేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. బట్టీ నిర్వహణకు సంబంధించి అనుమతి పత్రాలుంటే ఆర్డీవో కార్యాలయానికి వచ్చి సమర్పించాలన్నారు. కొందరు గిరిజనులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

దొంగిలించాడని చితకబాదారు..

కార్తీక్‌ను కొడుతున్న దృశ్యం

కొత్తగూడ, మార్చి 30 : డీజే సామగ్రిని దొంగిలించాడని ఓ యువకుడిని కొందరు యువకులు చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన వంకాయల కార్తీక్ పొగుళ్లపల్లిలోని టెంట్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. వారం రోజుల కిందట టెంట్‌హౌస్‌లోని డీజే సామగ్రి అపహరణకు గురైనట్లు యజమాని గుర్తించి, కార్తీక్‌ను పిలిపించి పొగుళ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో విచక్షణా రహితంగా కర్రతో కొట్టాడు. దళితుడైనందునే వీడియోలు తీస్తూ చితకబాదారని స్థానికులు తెలిపారు. ఎస్సై దిలీప్ దర్యాప్తు చేసి ఘటనకు బాధ్యులైన గట్టె అశోక్, సమ్మ హరీశ్, చెవ్వ శివ, వీ శివపై కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

గూడూరు, మార్చి 30 : కారు ఢీ కొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై నగేశ్ కథనం ప్రకారం.. మండలంలోని మచ్చర్లకు చెందిన యాద ధనలక్ష్మి(67) శుక్రవారం తన మనుమరాలిని మహబూబాద్‌లోని దవాఖానకు తీసుకెళ్లి తిరిగి ఆర్టీ సీ బస్సులో మచ్చర్ల గ్రామ బస్టాండ్ చేరుకున్నది. బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు ఎన్‌హెచ్ – 365 దాటుతున్న క్రమంలో గూడూరు నుంచి మహబూబాబాద్ వైపునకు వెళ్తున్న కారు అతివేగంగా ధనలక్ష్మిని ఢీ కొట్టిం ది. తీవ్ర గాయాలైన వృద్ధురాలిని మహబూబాబాద్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందు తూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఆమె కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌పై కేసు నమోదు

రిమాండ్‌కు తరలింపు

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : అక్రమ వసూళ్లకు పాల్పడిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. రూరల్ సీఐ కథనం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల కోసం ఈ నెల 15న జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాలో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 17నుంచి విధులు నిర్వర్తిస్తున్న వీరు మానుకోట చుట్టు పక్కల గ్రామాల్లోని కిరాణా షాపుల్లో తనిఖీ లు నిర్వహిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. రెడ్యాల గ్రామంలో మంజాల వేణు షాప్ వద్ద వేణు ఫోన్ పే నుంచి రూ.1500 తీసుకోగా, తన స్నేహితుడైన నల్లు దేవేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలోని ఎస్‌కే సద్దాంహుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ పట్టణంలోని షాపుల్లోకి వెళ్లి అక్రమంగా నగదు వసూలు చేయడంతోపాటు నగదు లేనివారి నుంచి టీంలోని ఫొటో గ్రాఫర్ కండే వెంకటేశ్వర్లు ఫోన్‌కి డబ్బులు ఫోన్ పే చేయించి, అతని నుంచి సద్దాంహుస్సేన్ తన ఫోన్ పేకు చేయించుకొనేవాడు. వారు వసూలు చేసిన మొత్తం రూ.15,100 నుంచి టీంలీడర్ అయిన సామ్రాట్‌కు రూ.10,500 ఇచ్చారు. పూర్తి విచారణ చేసిన పోలీసులు టీం లీడర్ సామ్రాట్, సద్దాం హుస్సేన్, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరితో పాటు టీంలో సభ్యులైన హెడ్ కానిస్టేబుల్ రమేశ్, గోపీలపై శాఖా పరమైన చర్యలు తీసుకొని విధులనుంచి తొలగించనున్నట్లు రూరల్ సీఐ తెలిపారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

తొర్రూరు, మార్చి 30 : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేశ్ కోరారు. మహనీయుల మాసోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 2 నుంచి 8 వరకు జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశానుసారం డివిజన్ కేంద్రంలో శనివారం పట్టణా ధ్యక్షుడు అనపర్తి నగేశ్, అనిల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ యాత్ర ఏప్రిల్ 4న తొర్రూరు పట్టణ కేంద్రానికి వస్తుందన్నారు. కాగా, ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని రాబోయే రోజుల్లో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఈ యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సీనియర్ నాయకులు ఏ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్, డివిజన్ నాయకులు అంజయ్య, రాకేశ్, ధర్మయ్య, రవి, పద్మయ్య, జాతీయ మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎంపీ మాలోత్ కవిత

బాధిత కుటుంబానికి పరామర్శ..

కేసముద్రం, మార్చి 30 : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ధన్నసరి గ్రామ మాజీ సర్పంచ్ బందారపు సూరయ్య కుటుంబ సభ్యులను ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు. సూరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు, సింగిల్ విండో చైర్మన్ దీకొండ వెంకన్న, మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు నీలం దుర్గేశ్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, జాటోత్ హరీశ్‌నాయక్, రమేశ్, భీమానాయక్, మంకు యాకూబ్‌రెడ్డి, సూరయ్య పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన ఉండాలి

మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : మూఢనమ్మకాల నిర్మూలనపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ టీ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భౌతికంగా కనిపించే వస్తువులు, పదార్థాలను మాత్రమే నమ్మాలని, ఊహాజనితమైన వస్తువులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పలయ్య, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, సతీశ్, మల్లారెడ్డి, కవిత పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏరియా వైద్యశాలలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. సమస్యలపై గళమెత్తిన కార్మికులను ఏజెన్సీ సూపర్‌వైజర్లు టార్గెట్ చేసి పని నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని డాక్టర్లు హామీ ఇవ్వడంతో నిరసన విరమించినట్లు పారిశుధ్య కార్మికులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దవంగర, మార్చి 30 : మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఈదురు వీరసోములు ఇటీవల మృతి చెందాడు. కాగా, శనివారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.7 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీసీ సెల్ మండల నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతి కార్యకర్తకు అండ గా ఉంటుందన్నారు. నాయకులు మల్లేశ్, రజినీకాంత్, రాము, యాకన్న, మహేశ్, సతీశ్, వెంకన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

నర్సింహులపేట, మార్చి 30 : ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్ష కార్యదర్శులు మలయ్య, తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ఆగస్టు 23 ముందే నియామకమైన ఉపాధ్యాయులు టెట్ అర్హత నుంచి మినహాఇంచాలన్నారు. ప్రస్తుత సిలబస్ నిబంధనలతో పరీక్షలు ఉత్తీర్ణత కావడం సులువు కాదన్నారు. ఎన్‌సెట్ అనుమతి తీసుకొని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

REAL ESTATE

★Open lands, Plots Old and New Houses, Villas, Duplex Houses, Farm Land 2900 Sq.Yards, Raghunathpalli, For sale Contact: 7396215583. NTW-00

ఆదిత్య శ్రీ రియాల్టర్స్ & డెవలపర్స్
★మీకు సంబంధించిన ఖాళీ స్థలాలను గానీ, ఇళ్ళ స్థలాలను గానీ, వ్యవసాయ స్థలాలను గానీ మాకు డెవలప్‌మెంట్‌కి ఇవ్వండి మీరు ఆశించినంత పొందండి సంప్ర: 9394326111, 7981174745. NTW-323036

LEASE/ RENT
★HNK, ఆదాత్ నుండి K.L.N రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్ (S.V.కాలనీ) రోడ్ నెం.5, 4 అంతస్థుల భవనం, ప్రతి ఫ్లోర్ 1650 Sft కిరాయి / లీజ్ కి ఇవ్వబడును. (New బిల్డింగ్) సంప్ర॥ సెల్ : 9502879612 KMM-11619

**HOUSE